క్లుప్తంగా

ఆదివాసీ ఉద్యోగుల అభ్యున్నతికి కృషి

మణుగూరురూరల్: ఆదివాసీ ఉద్యోగుల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. మండల పరిధిలోని తోగ్గూడెం సమ్మక్క–సారలమ్మ దేవాలయ సన్నిధిలో ఆదివారం సింగరేణి ఆదివాసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా, విశిష్ట అతిథిగా సింగరేణి మణుగూరు ఏరియా ఎస్వోటూ జీఎం వీసం కృష్ణయ్యలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ.. ఏజెన్సీలో ఆదివాసీల అభివృద్ధి కోసం ఉన్న చట్టాలు, హక్కుల పరిరక్షణకు పాటుపడడంతో పాటు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం ఎమ్మెల్యే, ఎస్వోటు జీఎంలను సంఘం నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీకే ఓసీ అండర్ మేనేజర్ వాడె అప్పారావు, ఆదివాసీ ఉద్యోగుల సంఘం నాయకులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుదాం

గుండాల: ప్రధాని నరేంద్ర మోదీ అనుసరిస్తున్న మతోన్మాద చర్యలకు వ్యతిరేకంగా యువత పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్శిక రవి పిలుపునిచ్చారు. ఆళ్లపల్లి మండలం ఇప్పనపల్లి గ్రామంలో ఆదివారం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతిని నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి ఉరికంబాన్ని ముద్దాడిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల ఆశయ సాధన కోసం యువత ఉద్యమించాలన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు అటికం శేఖర్, లాజర్, పూసం కృష్ణ, మోకాళ్ల శేఖర్, శివ, నాగప్రసాద్, ఎల్లన్న, అప్పారావు పాల్గొన్నారు.

లైటింగ్ ఏర్పాటు చేయాలి

మణుగూరురూరల్: మణుగూరు నుంచి భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్(బీటీపీఎస్) వరకు ప్రధాన రహదారి వెంబడి లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరుతూ సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ.. మణుగూరు సింగరేణి నుంచి నిత్యం వందలాది బొగ్గు లారీలు బీటీపీఎస్‌కు, ఇతర వాహనాలు ఏటూరు నాగారం వైపు రాకపోకలు చేస్తుంటాయని తెలిపారు. రాత్రి సమయాల్లో ఈ మార్గంలో లైటింగ్ లేకపోవడంతో ఆ వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. వి.జానయ్య,పి సంజీవరెడ్డి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రూనింగ్ పనులు చేపట్టాలి

చర్ల: తునికాకు ప్రూనింగ్ పనులను వెంటనే ప్రారంభించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కల్లూరి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం చర్లలోని ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజనులకు రెండో పంటగా పేరున్న తునికాకు సేకరణలో ప్రూనింగ్ పనులు ప్రధానమైనవని, త్వరగా ప్రూనింగ్ చేస్తే తునికాకు ఎక్కువగా పెరిగి నాణ్యతగా ఉంటుందని అన్నారు. సీపీఐ జిల్లా సమితి సభ్యులు అడ్డగర్ల తాతాజీ, నాయకులు ఆవుల వెంకట్రావు, నాగరాజు, నర్సింహారావు, రాజు, రవి, ముత్తయ్య, నర్సమ్మ, పద్మ, అనుసూయ పాల్గొన్నారు.

మహిళలకు అవగాహన

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని గిరిజన అభ్యుదయ భవన్‌లో శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో మహిళా సాధికారత, హక్కులు, చట్టాలపై అవగాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సాధికారిత కోసం మహిళ చేయవలిసిన బాధ్యత, నేటి బాలికలకు కావాల్సిన మేధస్సు గురించి పలువురు వక్తలు వివరించారు. అనంతరం భద్రాచలం దేవస్థానం ఈఓ రామాదేవి, ఉమెన్స్ ఐరాన్ అవార్డు గ్రహీత వరలక్ష్మి, శ్రీశ్రీ కళావేదిక జాతీయ అధ్యక్షురాలు చిట్టి లలితలను శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పద్మావతి, కవి ప్రసాద్, కనకదుర్గ, లక్ష్మీనారాయణ, వాణి, కోమలి, శుభద్ర, లక్ష్మి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతులు

దమ్మపేట: స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు పలువురు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాలను అందజేశారు. ఆదివారం మండలంలోని గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను, నియోజకవర్గ పరిధిలోని పలువురు ప్రజలు మర్యాదపూర్వకంగా కలసి, తమ సమస్యలను విన్నవించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని సూచించారు.

రైతుబంధు ఇవ్వాలి

బూర్గంపాడు: యాసంగి పంటల సాగుకు ప్రభుత్వం అందించే రైతుబంధును వెంటనే విడుదల చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు డి.పున్నంచంద్ డిమాండ్ చేశారు. ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి వంద రోజులు దాటిన రైతుబంధు ఇవ్వకుండా రైతులను ఇబ్బందులు పెడుతున్నారని ఆయన ఆరోపించారు.

'డబుల్' ఇళ్లు దక్కేనా?

- ఏళ్ల క్రితం డ్రా తీసిన అధికారులు
- నేటికీ కేటాయించని వైనం
- నూతన ప్రభుత్వంపై ప్రజల ఆశలు


అంజిబాక పంచాయతీలో అసంపూర్తిగా నిర్మించి వదిలేసిన ఇళ్లు

దుమ్ముగూడెం: గత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు గూడు కల్పించాలనే లక్ష్యంతో అట్టహాసంగా ప్రారంభించిన డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం మండలంలో ఎక్కడ వేసిన గొంగళి చందంగా మారింది. సంబంధిత కాంట్రాక్టర్‌లు బిల్లులు రాక నిర్మాణం వదిలివేయడంతో లక్షలాది రూపాయలు వృథాగా మారాయి.

అసంపూర్తిగా 125 ఇళ్లు..

మండలంలో 125 ఇళ్లు అసంపూర్తిగా నిర్మాణం చేపట్టి మధ్యలోనే ఆగిపోయాయి. గౌరారం, తూరుబాక, చిన్ననల్లబల్లి, మారాయిగూడెం, అంజిబాక పంచాయతీల్లో పంచాయతీకి 25 చొప్పున చేపట్టిన ఇళ్ల నిర్మాణం సగం సగం పనులు పూర్తయ్యి లబ్ధిదారులకు అందజేసే విధంగా లేకుండా ఉన్నాయి. మళ్లీ పేర్లు ఎక్కడ మారిపోతాయే అనే భయంతో కొన్ని పంచాయతీల్లో లబ్ధిదారులు అరకొరగా ఉన్న ఇళ్లల్లోనే ఉంటున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

ఇళ్ల నిర్మాణం పూర్తికాకుండానే గ్రామాల్లో లబ్ధిదారులను డ్రా పద్ధతిన ఎంపిక చేసిన అధికారులు.. నేటికి వాటిని పూర్తి చేసి కేటాయించకపోవడంతో ఆ ఇళ్ళు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారుతున్నాయి. మద్యం బాబులు, గంజాయి, పేకాట రాయుళ్లు ఇంకా అనేక కార్యక్రమాలకు నిలయాలుగా మారుతున్నాయని తెలుస్తోంది.

కాస్త చేయూతనిస్తే సరి..

ప్రధానంగా ఇళ్ల నిర్మాణంలో విద్యుత్ సరఫరా, నీటి సరఫరాకు సంబంధించి, కిటికీలు, తలుపులు, ప్లాస్టింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. కొంచెం నిధులు కేటాయిస్తే ఆ పనులు పూర్తయ్యి వినియోగంలోకి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అసంపూర్తిగా మిగిలిపోయిన డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తే గూడు లేని నిరుపేదలకు ఉపయోగకరంగా ఉంటుందని ప్రజలు వేడుకుంటున్నారు.

ఎదురుచూస్తున్నాం..



నిరుపేద కుటుంబానికి చెందిన మేము ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేస్తుందని ఎదురు చూశాం. డ్రా తీసి సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ ఇళ్లు కేటాయించ లేదు. వెయ్యి కళ్ళతో సొంతింటి కోసం ఎదురుచూస్తున్నాం. ఈ ప్రభుత్వం అయిన ఇళ్లు పూర్తి చేసి అందజేస్తే సంతోషం.

– సరియం వెంకటమ్మ, అంజిబాక

ఆశలు పెట్టుకున్నాం..



ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి అందజేస్తుందని ఆశలు పెట్టుకున్నాం. కానీ సంవత్సరాలు గడిచినా ఆశ నేరవేరలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అయినా అసంపూర్తిగా మిగిలి ఉన్న పనులు పూర్తి చేయాలని, ఇళ్లను మాకు అందజేయాలని కోరుతున్నాం.

– కొర్సా వెన్నెల, అంజిబాక

ఫ్లెక్సీలు, హోర్డింగుల తొలగింపు


మణుగూరురూరల్: ఫ్లెక్సీలు తొలగిస్తున్న సిబ్బంది

మణుగూరురూరల్: సాధారణ పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఎలక్షన్ కోడ్ అమలులోకి రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. అందులో భాగంగా ఆదివారం వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను, కటౌట్లను, బ్యానర్లను, జెండాలను మున్సిపల్, పంచాయతీల సిబ్బంది తొలగించారు. ఆయా పార్టీల స్థూపాలకు, నాయకులు విగ్రహాలకు ముసుగులు తొడిగారు. ఈ సందర్భంగా మణుగూరు తహసీల్దార్, అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాఘవరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ విద్వేషాలకు పాల్పడవద్దని సూచించారు.


అన్నపురెడ్డిపల్లిలో..

అన్నపురెడ్డిపల్లి: లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను పంచాయతీ అధికారులు తొలగించారు. ఆదివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను పంచాతీయ సిబ్బంది తొలగించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రజలు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు సహకరించాలని తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్ కోరారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

చర్ల: మండల కేంద్రమైన చర్లలో ఆదివారం పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఇక్కడ జరిగే వారపు సంతకు సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్, సుకుమా, దంతెవాడ జిల్లాల్లోని అటవీ ప్రాంతాలకు చెందిన గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ఆదివాసీలు తరలివస్తుండగా వారి మాటున మావోయిస్టులు రావచ్చునన్న అనుమానంతో పోలీసులు ఈ తనిఖీలను చేపట్టారు. మండల కేంద్రంలోని గాంధీ సెంటర్, లక్ష్మీకాలనీ, పెట్రోల్‌బంక్ సెంటర్లతో పాటు చర్లకు వచ్చే ప్రధాన రహదారులైన ఉంజుపల్లిరోడ్, తాలిపేరు ప్రాజెక్టు, పెదమిడిసిలేరు క్రాస్‌రోడ్, కుర్నపల్లి రోడ్‌లలో పోలీసులు మోహరించారు. వచ్చిపోయే ఆదివాసీలను నిశితంగా తనిఖీ చేశారు. అనుమానితులుగా భావిస్తూ పలువురు ఆదివాసీలను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. విచారించి వారిని విడిచిపెట్టారు. సీఐ ఏ.రాజువర్మ నేతృత్వంలో ఎస్సైలు టీవీఆర్ సూరి, నర్సిరెడ్డిలు తనిఖీలను కొనసాగించారు. సివిల్, స్పెషల్ పార్టీ, సీఆర్‌పీఎఫ్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

పొదెం నియామకంపై హర్షం


దుమ్ముగూడెం: సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ కార్యకర్తలు

భద్రాచలంటౌన్: భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్యను తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడంపై భద్రాచలం కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు పొదెం నివాసంలో ఆదివారం కాంగ్రెస్ నాయకులు స్వీట్లు పంచి సంబురాలు చేశారు. పొదెంకు ఆయా బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చింతిరాల రవికుమార్, అడబాల వెంకటేశ్వరరావు, తమ్మళ్ళ వెంకటేశ్వరరావు, శ్రీనివాస గౌడ్, బసవరాజు, అట్లాడా పాల్‌రాజ్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: డీసీసీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్యకు తెలంగాణ రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించడంపై కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరమాచినేని వినీల్ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం లక్ష్మీనగరం గ్రామంలో పెద్దెత్తున కాంగ్రెస్ కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేస్తూ మిఠాయిలు పంచుతూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్యకి రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్ చైర్మన్ పదవి కేటాయించడం వల్ల దుమ్ముగూడెం మండల అభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. మరో ప్రకటనలో వీరయ్యకు కార్పొరేషన్ చైర్మన్ పదవి రావడంపై కాశీనగరంకు చెందిన ఉస్మానియా విద్యార్థి గడ్డం అదాము హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బత్తుల శోభన్ బాబు, పూజారి సూర్య చంద్రరావు,మద్దిరామిరెడ్డి,వేమన రెడ్డి, అప్పల రెడ్డి,కొయ్యల మూడి కోటేశ్వరరావు, లక్ష్మీ నగరం ఎంపీటీసీ మద్దివనజ, మాజీ సర్పంచ్‌లు వర్షా చిన్నారావు, వర్ష శివ రామకృష్ణ, యూత్ నాయకులు సిద్ది ప్రవీణ్, దాట్ల వినోద్, సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'బార్' నామినేషన్ల స్వీకరణ

మణుగూరుటౌన్: మణుగూరు ప్రథమ శ్రేణి జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయవాదుల బార్ అసోసియేషన్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఈ మేరకు సోమవారం నుంచి నామినేషన్ల స్వీకరణ జరగనుండగా.. 21న స్క్రూట్నీ, 22న నామినేషన్ల విత్‌డ్రా, 28న పోలింగ్ అదే రోజు సాయంత్రం కౌంటింగ్ ఫలితాలు వెల్లడవుతాయని ఎన్నికల అధికారి జీవరత్నం, న్యాయవాది సహాయ ఎన్నికల అధికారి మధు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు పవర్ కట్

చర్ల: మండల కేంద్రమైన చర్లలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ యోహాను ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ మరమ్మతు పనుల నేపథ్యంలో పాతచర్ల ప్రాంతంలో ఈవిద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు.

లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

భద్రాచలంటౌన్: రాష్ట్ర ప్రభుత్వ విశ్రంత ఉద్యోగులు ఈ నెల 31లోపు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ భద్రాచలం డివిజన్ అధ్యక్షుడు బంధు వెంకటేశ్వర్లు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. భద్రాచలం ఎస్‌టీఓ కార్యాలయ పరిధిలో 2,200 మందికి గాను ఇంకా 307 మంది ఉద్యోగులు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాల్సి ఉందన్నారు. విశ్రంత ఉద్యోగులు టీయాప్ పోలియో, జీవన్ ప్రమాణ ద్వారా లైఫ్ సర్టిఫికెట్లను పంపాలని సూచించారు. అలా కాకపోతే సర్టిఫికెట్లను గెజిటెడ్ అధికారి ద్వారా ఆటాచ్ చేసి ఇవ్వాల్సి ఉంటుందని ఆయన వివరించారు.

ఎమ్మెల్యే జారే పరామర్శ


అగ్ని ప్రమాద బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ

అశ్వారావుపేటరూరల్: పలు కుటుంబాలను అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పరామర్శించారు. ఆదివారం మండలంలోని తిరుమలకుంట, మామిళ్లవారిగూడెం, కోయ రంగాపురం, నందిపాడుతోపాటు పలు గిరిజన గ్రామాల్లో ఎమ్మెల్యే ఆకస్మికంగా పర్యటించారు. ముందుగా తిరుమలకుంట గ్రామంలో ఇటివతే ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో పొట్టా రంగారావుకు చెందిన పూరిల్లు పూర్తిగా దగ్ధం కాగా.. బాధిత కుటుంబీకులను కలిసి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే గృహలక్ష్మి పథకం కింద ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే ఈ ఇదే గ్రామానికి చెందిన కొనకళ్ల రాజమ్మ, కొర్సా మహేశ్వరి, మొడియం అక్కమ్మ, మాడి బోడమ్మ కూలీ పనులకు వెళ్తూ, కొద్ది నెలల క్రితం ఏపీలోని వేలేరుపాడు మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇంటి వద్దే చికిత్స పొందుతున్నారు. ఈ బాధితులను ఎమ్మెల్యే వారి నివాసాలకు వెళ్లి వారి ఆరోగ్య వివరాలను తెలుసుకొని మెరుగైన వైద్యం అందించేలా కృషి చేస్తానని అన్నారు. అదే విధంగా గ్రామానికి చెందిన కోన భాస్కర్‌రావు మృతి చెందగా, మృతుడి కుటుంబీకులను పరామర్శించారు. మామిళ్లవారిగూడెం గ్రామానికి చెందిన చెవల హరీష్ రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో పరామర్శించి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం నందిపాడు గ్రామంలో జరిగిన ఓ వివాహ వేడుకకు ఎమ్మెల్యే హాజరు కాగా, గిరిజన సంప్రదాయ పద్ధతిలో కొమ్ము నృత్యాలతో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమాల్లో సొసైటీ చైర్మన్ చిన్నంశెట్టి సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు జూపల్లి ప్రమోద్, నంద్రు రమేష్, అల్లాడి రామారావు, మిండా హరి, రామినేని సత్యనారాయణ, జె.దుర్గారావు పాల్గొన్నారు.

మద్యం అమ్మొద్దని తీర్మానం


సాయినపల్లిలో మద్యం అమ్మొద్దని ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

గుండాల: సాయనపల్లి పంచాయతీ కేంద్రంలో మద్యం అమ్మకూడదని, ఎవరైనా అమ్మితే జరిమానా తప్పదని గ్రామస్తులు అన్నారు. ఈ మేరకు ఆదివారం మహిళలు, యువత, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. గత కొంత కాలంగా సాయనపల్లిలో మద్యం అమ్మకాలు ఎక్కువ కావడం, మద్యం ప్రియుల ఆరోగ్యాలు పాడవుతుండడంతో గ్రామస్తులంతా ఈనెల 16 నుంచి మద్యం నిషేధం అని తీర్మాణించుకున్నారు. కాగా ఆదివారం గ్రామస్తుల ఆధ్వర్యంలో అవగాహణ ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో ఏ ఒక్కరూ మద్యం అమ్మకాలు జరపకూడదని, ఎవరైనా అమ్మినట్లయితే వారికి జరిమానా విధిస్తామని గ్రామపెద్దలు స్పష్టం చేశారు. ఈ విషయంలో పోలీసు, మండలాధికారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఆత్మరక్షణకు కరాటే ఉపయోగకరం

దుమ్ముగూడెం: కరాటే మార్షల్ ఆర్ట్‌లో శిక్షణ ఆత్మరక్షణ కోసం ఎంతో ఉపయోగ పడుతుందని, ముఖ్యంగా విద్యార్థినులకు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఒత్తిడిని అధికమించేందుకు మార్షల్ ఆర్ట్స్ ఎంతో దోహదం చేస్తుందని ఎస్ఐ కేశవ్ రావు, జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ పేర్కొన్నారు. ఆదివారం ములకపాడు ప్రభుత్వ ఆస్పత్రి గ్రౌండ్‌లో జరిగిన కరాటే ట్రైనింగ్ ముగింపు కార్యక్రమంలో భాగంగా జరిగిన ప్రదర్శన కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. 3 నెలల పాటు కరాటే మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందిన కసూర్బా ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో విద్యార్థినులు చేసిన సాహస విన్యాసాలు పలువురిని మంత్రముగ్దులను చేశాయి. వారికి శిక్షణ ఇచ్చిన బన్ని మాస్టర్‌ను పలువురు అభినందించారు. కార్యక్రమంలో కరాటే కోచ్‌లు శేకర్ మాస్టర్, శ్రీధర్ మాస్టర్, పీఈటీ అన్నపూర్ణ, కోచ్‌లు ముద్దరాజు, వీరభద్రమ్, కోటేశ్వరరావు, నాగార్జున, వెంకన్న బాబు, ఈఆర్ఎస్ అధికార ప్రతినిధి జానీ పాషా, మాజీ సర్పంచ్‌లు సరియం సీతారాం, వర్సా చిన్నారావు, ఆదినారాయణ, సర్వర్ పాషా పాల్గొన్నారు.


శిథిలావస్థలో తహసీల్ భవనం



కరకగూడెం తహసీల్దార్ కార్యాలయం

కరకగూడెం: పెచ్చులూడిపోతున్న పైకప్పు.. వర్షం వస్తే కారిపోతున్న భవనం.. ఆరుబయట నిలిచిపోతున్న నీరు.. ఏ క్షణాన ఏం ప్రమాదం జరుగుతుందోనని ఉద్యోగుల్లో భయం. ఇదీ.. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో దుస్థితి. గత ప్రభుత్వం 2016లో పినపాక మండలం నుంచి కరకగూడెంను మండలంగా ప్రకటించి పాలనను సాగిస్తున్నది. ఈ క్రమంలో నాడు హడావుడిగా ఆయుర్వేద ఆస్పత్రిని తహసీల్దార్ కార్యాలయంగా మార్చి ప్రజలకు అందుబాటులో తెచ్చింది. అయినప్పటికీ భవనం స్లాబ్ పెచ్చులు ఉడుతున్న పట్టించుకునే వారు కరువయ్యారు. దీంతో కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది వివిధ సమస్యలపై వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా కొత్తగా ఏర్పాడిన ప్రభుత్వం, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి నూతన భవనాన్ని నిర్మించాలని అప్పటివరకైనా పెచ్చులు ఉడకుండా తాత్కాలిక మరమ్మతులు అయినా చేపట్టాలని పలువురు కోరుతున్నారు.




పెచ్చులు ఊడుతున్న తహసీల్దార్ కార్యాలయం లోపల భాగం

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

బూర్గంపాడు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. బూర్గంపాడు మండలంలో నాలుగు సెంటర్లలో పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఈ నాలుగు సెంటర్లలో మొత్తం 670 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. 36 మంది ఇన్విజిలేటర్లు పరీక్షలను పర్యవేక్షించనున్నారు. పరీక్షా కేంద్రాల పరిసరాలలో 144సెక్షన్‌ను అమలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

దమ్మపేట: పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మండల పరిధిలో మొత్తం ఐదు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తంగా 771 మంది హాజరుకానున్నారు.కేంద్రాల నిర్వహణకు 47 మంది ఇన్విజిలేటర్లకు డ్యూటీలు వేశారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేశామని ఎంఈఓ కీసర లక్ష్మి తెలిపారు.

గుండాల: నేటి నుంచి జరగబోయే పది పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖాధికారి పెండెకట్ల కృష్ణయ్య తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గుండాల గురుకుల పాఠశాల పరీక్షా కేంద్రంలో 122 మంది, కాచనపల్లి క్రీడా పాఠశాల పరీక్షా కేంద్రంలో 90మంది, ఆళ్లపల్లి మండలం జెడ్పీఎస్ నందు 105 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాలలో ఇన్విజలేటర్స్, డీఎస్, డీఓలను నియమించడం జరిగిందన్నారు. ఆయా పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. విద్యార్థులు పరీక్షా సమయానికి ముందుగానే హాజరుకావాలని సూచించారు.


మణుగూరుటౌన్: పరీక్ష కేంద్రంలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

మణుగూరుటౌన్: పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమవుతుండగా.. విద్యాశాఖ అధికారులు అందుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేశారు.

మణుగూరు మండలంలో జెడ్పీ హైస్కూల్, మాంటిస్సోరి, సింగరేణి హై స్కూల్, గౌతమ్‌మోడల్ స్కూల్, సీ–టైప్ ఎక్సెలెంట్ పాఠశాలల్లో ఐదు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా.. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో కలిపి 886 మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరుకానున్నారు. ప్రతీ సెంటర్‌కు తొమ్మిది గదులతో పాటు 11 మంది ఇన్విజిలేటర్లను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ వీరాస్వామి తెలిపారు. ఈ మేరకు ఆయా పాఠశాలల్లో విద్యార్థుల హాల్‌టికెట్ల నెంబర్లు బెంచీలపై వేశారు. ఆయా సెంటర్లలో పరీక్షకు హజరయ్యే విద్యార్థులకు అన్ని వసతులు కల్పించేలా ఎంఈఓ వీరస్వామి చర్యలు తీసుకున్నారు.

దుమ్ముగూడెం: పదో తరగతి పరీక్షలకు మండల విద్యాశాఖ అధికారయంత్రాంగం సర్వం సిద్ధం చేశారు. మండలంలో మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా 458 మంది విద్యార్థినీ, విద్యార్థులు పరీక్షలకు హజరు కానున్నారు. మండలంలోని రేగుబల్లి ఆశ్రమ పాఠశాల, నర్సాపురం జిల్లా పరిషత్ పాఠశాల, కొత్తపల్లి బాలుర ఆశ్రమ పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ సున్నం సమ్మయ్య తెలిపారు. ముగ్గురు చీఫ్ సూపరింటెంట్ అధికారులు,ముగ్గురు డిపార్ట్‌మెంటల్ అధికారులు,ఒకరు కస్టోడియన్ అధికారి 30మంది ఇన్విజిలేటర్‌లను పరీక్షల నిర్వహణ కోసం నియమించినట్లు వెల్లడించారు.